క్లుప్తంగా

ఎంపీపీ రాజీనామా



సీఈఓకు రాజీనామా పత్రం అందజేస్తున్న అనసూయమ్మ

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె ఎంపీపీ అనసూయమ్మ సోమవారం తమ పదవికి రాజీనామా చేశారు. చిత్తూరు జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్‌నాయుడుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. విదేశాల్లో ఉన్న పిల్లల వద్దకు భర్త నారాయణరెడ్డితో కలసి వెళుతున్న కారణంగా అక్కడే ఏడు నెలల పాటు ఉంటామని, మండల పరిషత్ అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా మరొకరిని నియమించాలని సీఈఓను కోరినట్లు తెలిపారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, చక్రపాణి రెడ్డి, రెడ్డికుమార్ తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఫకురున్నిసా

పీలేరు : జ్యోతిబా పూలే ప్రిన్సిపాల్‌గా ఫకురున్నిసా బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా ఉన్న రాధారాణి బదిలీపై పులిచెర్లకు వెళ్లారు. లేపాక్షి టీకలూరులో పీజీటీగా, జూనియర్ లెక్చరర్‌గా పని చేసిన ఫకురున్నిసా మెగా డీఎస్సీలో ప్రిన్సిపాల్ ఉద్యోగం సాధించింది. పీలేరు జ్యోతిబా పూలే ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కలికిరి : వాల్మీకిపురం మండల పరిధిలోని టీకలకోన వద్ద నూతనంగా నిర్మిస్తున్న బాట గంగమ్మ ఆలయానికి కలికిరి మండలం కె.రెడ్డివారిపల్లి గ్రామం నర్రావాండ్లపల్లికి చెందిన దాతలు డీవీ కుమార్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి సోమవారం రూ.25 వేలు విరాళంగా ఆలయ ధర్మకర్త శ్రీరామిరెడ్డికి అందచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



నాగరాజు

తంబళ్లపల్లె: మండల వీఆర్‌ఓల సంఘం అధ్యక్షులుగా వీఆర్‌ఓ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి జాన్సన్‌ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం మండల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా రాజగోపాల్, గౌరవ అధ్యక్షులుగా సంజీవ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎంఆర్‌ఐ ముద్దకృష్ణమ వ్యవహరించారు. వీఆర్‌ఓల సమస్యల పరిష్కారానికి సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

స్విమ్మింగ్ పోటీల్లో సత్తా




మెడల్స్, మెమెంటోతో నాగరాజు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రానికి చెందిన పూల నాగరాజు ఈ నెల 11, 12 తేదీలలో మంగళగిరిలోని 7వ జాతీయ మాస్టర్స్ ఆక్వాటిక్ చాంపియన్ షిప్ 2025 స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్లు, బటర్ ఫ్లై 50 మీటర్లు, బటర్‌ఫ్లై 25 మీటర్ల ఈత పోటీల్లో సత్తా చాటి బంగారు పతకాలతోపాటు మెమెంటోలను అందుకున్నారు. ఈయన గత ఏడాది నవంబర్‌లో కూడా రాజమహేంద్రవరంలో జరిగిన పోటీలో ప్రతిభ చాటారు. ఈయన తెలంగాణా రాష్ట్రంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చీఫ్ రేడియోగ్రాఫర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. గతంలో కూడా అంతర్జాతీయ స్థాయిలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన ఇతను రజత పతకాలు అందుకోవడంతో.. గత ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఏపీ రాజ్‌భవన్‌లో జరిగిన సన్మాన, విందు కార్యక్రమానికి ఆహ్వానం అందింది.

ఫిర్యాదులు పరిష్కరించండి

మదనపల్లె : పట్టణ ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని కమిషనర్ కె.ప్రమీల అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో అందిన ఐదు ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులకు నివేదించి చర్యలకు ఆదేశించారు.

ఆశీర్వాదం



నూతన వరుడిని ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల, నాయకులు

కలికిరి : కలికిరి మండలం మహల్‌కు చెందిన బీఎస్‌ఏ హాస్పిటల్ అధినేత, రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు డా.ఇక్బాల్ అహ్మద్ ఖాన్ కుమారుడు డాక్టర్ జుల్ఫికర్ అహమ్మద్ ఖాన్ వివాహం సోమవారం రాయచోటిలోని అభి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ వేడుకకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

టీడీపీలో మద్యం వ్యాపారులకే టికెట్లు

- నకిలీ మద్యం కేసులో ప్రధాన సూత్రధారులను వదిలేశారు
- ఈ కేసు సీబీఐకి అప్పగించాలి
- టీడీపీలోని వైఎస్సార్‌సీపీ నేతలను సస్పెండ్ చేయగలరా?
- వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజం



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణులు (ఇన్‌సెట్‌లో) ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

మదనపల్లె: నకిలీమద్యం కేసును సీబీఐకి అప్పగిస్తే సూత్రధారులైన పెద్దల ప్రమేయం వెలుగులోకి వస్తుందని, ప్రభుత్వం సిట్ వేసి నిజాలకు సమాధి కట్టేందుకు సిద్ధమైందని మదనపల్లె వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మదనపల్లెలో నకిలీమద్యంపై నిరసన ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్‌పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. స్థానిక నక్కలదిన్నె నుంచి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్దకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు ర్యాలీగా చేరుకున్నారు. కల్తీ, నకిలీమద్యం నశించాలని, ప్రభుత్వం సూత్రధారులను అరెస్ట్ చేయాలని కోరుతూ ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. ఎక్సైజ్ స్టేషన్ వద్ద నకిలీమద్యంపై నిరసన వ్యక్తం చేశారు. తర్వాత ఎస్ఐ డార్కస్‌కు సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు షమీంఅస్లాం, మున్సిపల్ చైర్మన్ మనూజ, పార్టీ పరిశీలకురాలు ఎస్.అనీషారెడ్డి, ఎస్.శ్రీనాథరెడ్డిలు వినతిపత్రం అందించారు. తక్షణమే నకిలీ, కల్తీమద్యం తయారీ, విక్రయాలపై కఠినచర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

లిక్కర్ వ్యాపారులకే టికెట్లు

ఈ సందర్భంగా సమన్వయకర్త నిసార్ అహ్మద్ మాట్లాడుతూ 'ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రజలకు ఏ మేరకు సేవ చేశారు, వారి గుణగణాలను తెలుసుకుని టికెట్లు ఇస్తారు. టీడీపీ టికెట్ల విషయంలో చంద్రబాబు అభ్యర్థులకు విదేశాల్లో డిస్టలరీలు ఉన్నాయా, మద్యం తయారీ యూనిట్లు ఉన్నాయా, తయారీదార్లు ఉన్నారా అని తెలుసుకుని.. టికెట్లు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడి జేబులు నింపుకోవడం మామూలైంది' అన్నారు.

సూత్రాధారులను కాపాడేందుకే..

మాజీ ఎమ్మెల్యే, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి మాట్లాడుతూ నకిలీమద్యం అరికట్టి కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం సూత్రధారులను కాపాడుతూ జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడు లాంటి వారిని బలిచేసి పెద్దలను కాపాడుతున్నారని అన్నారు. విజయవాడ కేంద్రంగా నకిలీ మద్యం మూలాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సస్పెండ్ చేసే దమ్ముందా

స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జి.షమీంఅస్లాం మాట్లాడుతూ నకిలీమద్యం తాగిన వారు మృతి చెందుతూ కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం గురించి ప్రశ్నిస్తే టీడీపీలోని జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేసిన చంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన పెద్దనేతలను దమ్ముంటే సస్పెండ్ చేయగలరా అని సవాల్ చేశారు.

ప్రజల్లో చైతన్యం

మున్సిపల్ చైర్మన్ మనూజ మాట్లాడుతూ నకిలీ మద్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం పార్టీ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. మద్యంతో మరణించిన వారి కుటుంబాలు వీధిపాలవుతున్నాయని అన్నారు.

వీధివీధినా బెల్టుషాపులు

వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనలో వీధివీధినా బెల్టుషాపులు, నకిలీమద్యం ప్లాంట్లు ఏర్పడి దాన్ని తాగిన ప్రజల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌ఆర్‌ఐ విభాగం నాయకులు దండు శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్ చంద్రశేఖర్, ప్రసాద్, ఈశ్వర్‌నాయక్, శ్రీనివాసులు, రహీం, వినుతాబాయి, శారద రెడ్డి, షబానా, ముబీనా, రమణ, వైస్‌ఎంపీపీ రమణ, సర్పంచు శరత్‌రెడ్డి, గుండ్లూరి రఫీ, నాగరాజరెడ్డి, మహేష్‌బాబు, సాయి, మస్తాన్‌రెడ్డి, నూర్, ఎస్‌ఏ.కరీముల్లా, యూనస్, మయూరి రఘునాధరెడ్డి, నవాజ్, మాజీ కౌన్సిలర్ సురేంద్ర, జయంతి, మల్లిక, మంజు పాల్గొన్నారు.

సీబీఐతో విచారణ జరపాలి

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లి : ములకలచెరువులో జరిగిన నకిలీ మద్యం తయారీపై సీబీఐచే విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మార్లలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో నిజానిజాలు వెలికి తీయాలంటే సీబీఐచే విచారణ చేపట్టాలన్నారు. పారదర్శకంగా విచారణ జరిపితే అధికార పార్టీ ఆగడాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరగని అక్రమ మద్యం కేసులో ఉద్దేశ పూర్వకంగా, కుట్రపూరితంగా వైఎస్సార్‌సీపీలో ప్రధాన నాయకులపై కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలో భాగంగానే అక్రమ కేసులు పెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం చంద్రబాబు సొంత పార్టీ వారే నకిలీమద్యం తయారీ చేయడంతో కేసు తప్పుదారి పట్టించేందుకు పొంతన లేని సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే ములకలచెరువు నకిలీ మద్యం తయారీపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మార్లకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోనేటి పరుసురాం కుమారుడు కోనేటి శ్రావణ్‌కుమార్ మృతి చెందడంతో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు సి.కె. యర్రమరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నీళ్లభాస్కర్, వేణుగోపాల్‌రెడ్డి, కేశవరెడ్డి, శ్రీనాథరెడ్డి, దినేష్‌రెడ్డి, వాసయ్య, దేవేంద్ర రెడ్డి, కిషోర్‌రెడ్డి, మణి, చిన్నరెడ్డెప్పరెడ్డి, రవిచంద్రారెడ్డి, అప్పిరెడ్డి, యల్లయ్య, గౌస్, వేణుగోపాల్, కాలనీ చిన్న, కుసుమశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై నేడు నిరసన

పీలేరు రూరల్ : కల్తీ మద్యం తయారీపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పీలేరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నిరసన కార్యక్రమానికి హాజరుకండి

కలకడ : నకిలీ మద్యంపై పీలేరు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని కన్వీనర్ కమలాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కలకడ మండలం నుంచి అభిమానులు, కార్యకర్తలు, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ హోదాలలో పార్టీ పదవులు పొందినవారు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

నకిలీ మద్యంపై వెల్లువెత్తిన నిరసన

- ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ర్యాలీ
- ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా



ములకలచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ములకలచెరువు : ములకలచెరువులో నకిలీ మద్యం తయారీని ఒక పరిశ్రమలా మార్చి.. దానిని రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తూ... ప్రజల ప్రాణాలను హరిస్తున్న టీడీపీ నాయకుల వైఖరి, కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా సోమవారం తంబళ్లపల్లె నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పీటీయం రోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం గంట పాటు కార్యాలయం ఎదుట కల్తీ మద్యానికి సంబంధించి ప్రధాన సూత్రదారులను అరెస్టు చేయాలని, కల్తీ మద్యం కేసు సిట్‌కి కాకుండా సీబీఐకి అప్పగించాలని నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ... నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా వైన్‌షాపులు, పర్మిట్‌రూములు, బార్లు, బెల్టుషాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేసి దీని వెనుక ఎంత పెద్దవారున్నా అరెస్టు చేయాలని... నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు జరిగేలా డిమాండ్ చేశారు. నకిలీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైన్ షాపుల కేటాయింపులో జరిగిన అక్రమాలను గుర్తించి అనర్హులను తొలగించాలని, మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించేలా చొరవ చూపాలని, మద్యం విక్రయ వేళలు కూడా తగ్గించాలని కోరారు. బడులు, గుడులు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వైన్‌షాపులు, బార్ల లైసెంస్సులను రద్దు చేసేలా ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ సిఫార్సు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మాదవరెడ్డి, చౌడేశ్వర్, ఎంపీపీలు సాయిలీలా, పూర్ణచంద్రిక, మహమూద్, జెడ్పీటీసీ సభ్యులు మోహన్‌రెడ్డి, రామచంద్ర, ప్రచార కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నక్కా రమాదేవి, జిల్లా నాయకురాలు జ్యోతి, సర్పంచులు రహమత్‌బీ, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంబాబు, వెంకరమణారెడ్డి, ఎంపీటీసీలు ఆయిషా, మహేశ్వరి, లక్ష్మీదేవి, నాయకులు వై.రవిశేఖర్‌రెడ్డి, రెడ్డిశేఖర్ నాయుడు, ఉమామహేశ్వర్, చాంద్ బాషా, విశ్వనాథ్, రెడ్డెం క్రిష్టారెడ్డి, రామశంకర్‌రెడ్డి, మల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అన్సర్‌బాషా, కోటి మల్లికార్జున, పప్పు రాజారెడ్డి, సుబ్బిరెడ్డి, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్ ఏఓ నిర్మలాదేవికి ఫిర్యాదు చేస్తున్న నిసార్‌అహ్మద్, వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు

మదనపల్లె రూరల్ : గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా కొన్ని పంచాయతీల నుంచి అక్రమంగా నిధులు డ్రా చేస్తూ మదనపల్లె ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ అవినీతికి పాల్పడుతున్నారని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో... వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌తో కలిసి సర్పంచ్‌లు, ఏఓ నిర్మలాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలపై ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. వీధి లైట్లు, శానిటేషన్, తాగునీరుకు సంబంధించి పనులు చేయాలన్నా, బిల్లులు పెట్టాలన్నా ఎంపీడీఓ అనుమతి తీసుకోవాలని, పదే పదే తన చుట్టూ తిప్పుకుంటున్నాడన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు అనుకూలంగా ఉండాలని, సర్పంచ్‌లపై ఒత్తిడి తెస్తూ రాజకీయాలు చేస్తున్నాడన్నారు. ఎంపీడీఓ అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్ ఎంపీపీ డిష్ రమణ, సర్పంచ్‌లు దండుకరుణాకర్ రెడ్డి, శరత్‌రెడ్డి, రెడ్డెమ్మ, ఈశ్వరమ్మ, గణేష్, బి.రాజేశ్వరి, ఎస్.వెంకటరమణ, మల్లికార్జున, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బావాజాన్, వినుతాభాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితి పట్టించుకోండి

మదనపల్లె నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్ల దుస్థితి దారుణంగా తయారైందని, మరమ్మతులు చేసే వారే కరువయ్యారని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. గుంతలు లేని రోడ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రభుత్వం, మరమ్మతులు చేసేందుకు ముందుకురావడం లేదన్నారు.

ఏపీ గురుకుల పాఠశాలను మార్చాలి



దిగువ సరిమడుగు పాఠశాల భవనాలను పరిశీలిస్తున్న మస్తానయ్య

గుర్రంకొండ : గుర్రంకొండలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలను తాత్కాలికంగా సరిమడుగుకు మార్చాలని రాష్ట్ర గురుకుల పాఠశాలల కార్యదర్శి మస్తానయ్య అన్నారు. సోమవారం స్థానిక ఏపీగురుకుల బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలను విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రేకులషెడ్డు కావడంలోపాటు సౌకర్యాలు సరిగా లేవని పేర్కొన్నారు. అనంతరం ఆయన మండలంలోని సరిమడుగు పంచాయతీ దిగువ సరిమడుగు ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ తొమ్మిమిది గదులు ఉండడంతో పాటుగా కేవలం 17 మంది విద్యార్థులే ఉండడంతో గుర్రంకొండలోని ఏపీ గురుకుల పాఠశాలను తాత్కాలికంగా అక్కడికి మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. దిగువ సరిమడుగు పాఠశాలలో కొత్తగా 15 మరుగుదొడ్లు నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుబ్రమణ్యం, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిశిరిష, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

మదనపల్లె సిటీ : స్థానిక పుంగనూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం హెచ్‌ఎంజీ టెక్నాలజీస్ ఇంటర్న్‌షిప్ కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు బీటెక్ నాల్గోవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. వివిధ విభాగాల నుంచి ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి నెలకు రూ.15 వేలు ఇంటర్న్‌షిప్ స్టైఫండ్ ఇవ్వనున్నట్లు హెచ్‌ఎంజీ టెక్నాలజీస్ సంస్థ తెలిపారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, కాలేజీకి మంచి గుర్తింపు తీసుకువాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

మదనపల్లె సిటీ : హంద్రీనీవా కాలువలో ఈత కోసం వెళ్లిన విద్యార్థి మృతి చెందాడని, అందుకు కారణమైన అభ్యుదయ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యుఐ ఆర్‌ఎస్‌ఓ, డిబిఎస్‌ఎఫ్, ఎపివిహెచ్‌పీఎస్ విద్యార్థి సంఘాలు ఆ పాఠశాల ఎదుట నిరసన తెలియజేశారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహా మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి సాయికిరణ్ మృతి చెందాడని ఆరోపించారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. సెలవు రోజుల్లో పాఠశాల నిర్వహించారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా విద్యాశాఖ ప్రైవేటు పాఠశాలలపై పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు జగన్, భానుప్రకాష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

మదనపల్లె : మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో నవంబర్ 3వ తేది నుంచి సమ్మెలోకి వెళ్తామని పేర్కొంటూ సోమవారం మున్సిపల్ కార్మికుల సంఘ నేతలు కమిషనర్ కె.ప్రమీలకు సమ్మె నోటీసు అందించారు. రెండేళ్లుగా విధుల్లో మరణించిన కార్మికుల స్థానంలో ఔట్‌సోర్సింగ్ ద్వారా కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని, 12వ పీఆర్‌సీ ప్రకటించి 30 శాతం భృతి ఇవ్వాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కార్మిక సంఘ నేత మస్తాన్ డిమాండ్ చేశారు. ఇంకా మిగిలిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేదని, దీనిపై నవంబర్ 2వ తేదీలోగా నిర్ణయం తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో సమ్మె తప్పదని పేర్కొన్నారు.

సేవాతత్పరుడు.. విజయభారతి సేతు



విజయభారతి సేతుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మదనపల్లె రూరల్: సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించి...విద్యావేత్తగా, మానవతావాదిగా పేరుతెచ్చుకుని అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న సేవా తత్పరుడు విజయభారతి సేతు అంటూ పలువురు కొనియాడారు. సోమవారం విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్.నల్లా సేతుస్వామి పుట్టినరోజు వేడుకలు స్థానిక పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కుల,మత భేదాలు లేకుండా పేద వారికి సేవలందించడమే కాకుండా గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో సేతుస్వామి కృషి మరువలేనిదన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పఠాన్‌ఖాదర్‌ఖాన్ ఆధ్వర్యంలో చైతన్య అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేతుస్వామి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు పసుపులేటిచలపతి, బోర్‌వెల్ మహేష్, డీవైఈఓ లోకేశ్వరరెడ్డి, ఎంఈఓ ప్రభాకరరెడ్డి, బీజేపీ నాయకులు డాక్టర్ అజ్మతుల్లా ఖాన్, బండి ఆనంద్, పూల నాగరాజ, టీడీపీ నాయకులు శ్రీరామ్‌చినబాబు, దొరస్వామినాయుడు, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళీ తదితరులు ఉన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన

కలికిరి : జీవన ఎరువుల వినియోగ వారోత్సవాలలో భాగంగా సోమవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ఐదు రోజులు పాటు కేవీకే పరిధిలోని రైతులకు జీవన ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేవీకే కో-ఆర్డినేటర్ మంజుల తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కలికిరి మండలం మేడికుర్తి గ్రామం, పీలేరు మండలంలోని మిట్టపల్లి గ్రామాలలో కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు మాధురి, శ్రీనివాసులు, పీరూ సాహెబ్, శరత్‌కుమార్‌రెడ్డి, తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వయుజ మాసం శుభ సోమవారం సందర్భంగా వేద పండితులు మల్లికార్జున శాస్త్రి, ఖన్నాస్వామిలు శివ, పార్వతుల ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

పెద్దతిప్పసముద్రం మండలంలో 44 టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా డీఎస్సీ ద్వారా 31 పోస్టులను భర్తీ చేశారు. ఈ మేరకు ఎంపికైన నూతన టీచర్లు సోమవారం ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్‌ల నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శంకర్, అశోక్‌రెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి ఊరేగింపు

తంబళ్లపల్లె: అయ్యప్పమాలాధారులు సోమవారం తంబళ్లపల్లె పురవీధులలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. గురుస్వామి రత్నస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీలకు గౌరవ పేర్లు పెట్టాలి

పీలేరు రూరల్ : ఎస్సీ, ఎస్టీ కాలనీలకు గౌరవప్రదమైన పేర్లు పెట్టాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బోదేషావల్లి కోరారు. సోమవారం తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 15 పంచాయతీల్లోని అనేక ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సామాజికంగా అనుచితంగా భావించబడకుండా గౌరవప్రదమైన పేర్లు పెట్టాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా గ్రామాల్లో ప్రజల అభిప్రాయం మేరకు కొత్తపేర్లను ఆమోదించాలని కోరారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

కలికిరి : సీపీఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండాలని కలికిరి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ కుమార్ అన్నారు. సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక సీహెచ్‌సీలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా గుండె కొట్టుకోవడం ఆగిపోయినా, ఊపిరి పీల్చుకోవడం లేకపోతే వెంటనే ఛాతీ మీదు ఒత్తాలని, అలాగే 108కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటేష్, శశికుమార్‌రాజు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.